ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 9 మే 2025



'ఎర్లీబర్డ్' అంతంతే



సిరిసిల్ల మున్సిపల్ భవనం

- 2024-25 ఆస్తి పన్ను వసూళ్లతో ఖజానా కళకళ
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో రూ.9.60 కోట్లు ఇంటి పన్ను వసూలు
- ఎర్లీబర్డ్ రాయితీపై అనాసక్తి..
- ఈనెల 7తో ముగిసిన గడువు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆస్తి పన్ను వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామపంచాయతీల్లో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. అలాగే సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు సైతం ముందు వరుసలోనే నిలిచాయి. గ్రామపంచాయతీలతో పోల్చుకుంటే మున్సిపాలిటీల్లో 2024-2025 ఆస్తి పన్నుల వసూళ్లలో రూ.9.60కోట్ల వరకు వసూలు చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీల్లో 96.99శాతం, వేములవాడలో 85.14శాతం పన్నులు వసూలు చేశారు. మున్సిపాలిటీల్లో ప్రతి సంవత్సరం ఎర్లీ బర్డ్ పేరిట ఐదుశాతం రిబేట్‌తో రాయితీ స్కీంలో ఆస్తి పన్ను చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం ఇస్తూ వస్తోంది. ఇందులో భాగంగా మార్చి 31 వరకు సాధారణ పన్నుల వసూలు ప్రక్రియ పూర్తికాగా, ఏప్రిల్ 30వరకు ఐదు శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 30 వరకు కూడా ఆశించిన మేరకు పన్నుల వసూలు లేకపోవడంతో మే 7 వరకు అవకాశాన్ని పొడిగించినా రాయితీపై అంతంత మాత్రంగానే స్పందన వచ్చింది.

● పన్నుల వసూళ్లలో పల్లెలు ఆదర్శం..

పన్నుల వసూళ్లలో పల్లెలు ఆదర్శంగా నిలిచాయి. 2024-25 మార్చి 31వరకు ఆస్తిపన్నుల వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలోనే ప్రథమంగా నిలిచింది. జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో వందశాతం పన్నుల లక్ష్యాన్ని 99శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 12 మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్నుల్లో పాత బకాయిలతో కలిపి రూ.7 కోట్ల 21లక్షల 42వేల 291 వసూలు లక్ష్యం ఉండగా రూ.7 కోట్ల 12 లక్షల 27 వేల 901 వసూలు చేశారు. కేవలం రూ.9లక్షల 15వేల 390 మాత్రమే బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 12 మండలాల్లో 8 మండలాలు వంద శాతం వసూలు పూర్తి చేశారు. వందశాతం లక్ష్యం సాధించిన మండలాల్లో చందుర్తి, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వేములవాడరూరల్ మండలాలు ఉన్నాయి. 99శాతంలో బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఉండగా తంగళ్లపల్లి 98 శాతం, గంభీరావుపేట 91 శాతంతో ఉన్నాయి. పన్నుల వసూళ్లలో బోయినపల్లి మండలంలో 23 గ్రామపంచాయతీల్లో 51,65, 364 రూపాయలకు 51,18,846 రూపాయలు వసూలు చేశారు. చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీల్లో రూ.49,54,330కు వసూలు రూ.44,96,966, ఇల్లంతకుంట మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో రూ.53,52,978కు వసూలు రూ.52,74,624, గంభీరావుపేట మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.70,02,546కు వసూలు రూ.63,88,255, కోనరావుపేట మండలంలో 28 గ్రామపంచాయతీల్లో రూ.44,82,537కు వసూలు రూ.44,96,966, ముస్తాబాద్ మండలంలో 22 గ్రామపంచా యతీల్లో రూ.1,07,02,265కు వసూలు రూ.1,06, 73,103, రుద్రంగి మండలంలో పది గ్రామపంచాయతీల్లో రూ.29,59, 690కు వసూలు రూ.29,47,630, తంగళ్లపల్లి మండలంలో 30 గ్రామపంచాయతీల్లో రూ.88,33,109కు వసూలు రూ.86,52,434, వీర్నపల్లి మండలంలో 17 గ్రామపంచాయ తీల్లో రూ.18,40,706కు వసూలు రూ.18, 42,898, వేములవాడ మండ లంలో 11 గ్రామపంచాయతీల్లో రూ.71,70,096కు వసూలు రూ.71,71,250, వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో రూ.24,70,871కు వసూలు రూ.24,71,668, ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీల్లో రూ.1,12,08,799కు రూ.1,12,27, 998 వసూలుచేశారు.

● ఎర్లీ బర్డ్‌లో రూ.3.77 కోట్ల వసూలు

రాజన్న సిరిసిల్లజిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు 2025-26 ఆస్తిపన్నులకు సంబంధించి సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,778 భవనాలకు సంబంధించి రూ9.75 కోట్లు లక్ష్యంగా ఉంది. ఇందులో 5శాతం రాయితీని 5,117 ఇండ్లకు సంబంధించి వినియోగించుకున్నారు. 2.37 కోట్లు వసూలు కాగా 24.31 శాతంగా ఉంది. వేములవాడలో 15,002 భవనాలకు సంబంధించి 20.11 కోట్లు కాగా, 3,567 భవనాలకు సంబంధించి రూ.1.40కోట్లు వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ ఆస్తి పన్నులు మినహా ఇళ్లకు సంబంధించిన పన్నులో సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,487 ఇళ్లకు రూ.6.36కోట్ల లక్ష్యానికి రూ.6.13కోట్లతో 96.99శాతంతో ముందంజలో నిలిచారు. వేములవాడ మున్సిపాలిటీలో రూ.4.07కోట్లు లక్ష్యం కాగా రూ.3.47 కోట్లు వసూలు చేసి 85.14 శాతంతో నిలిచారు.

బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ భూమిపూజకు గవర్నర్



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

సిరిసిల్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజన్న సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో వేములవాడ మండలం తిప్పాపూర్‌లో నిర్మించే బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ భూమిపూజకు గవర్నర్ భిష్ణుదేవ్‌వర్మను గురువారం హైదరాబాద్‌లో సిరిసిల్ల రెడ్‌క్రాస్ సలహాదారులు వి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రయాకర్‌రావు, వేణులు ఆహ్వానించారు. భూమిపూజకు వస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వెయ్యి గజాల ప్రభుత్వ భూమిని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ కోసం వేములవాడ మండలం తిప్పాపూర్‌లో కేటాయించారు.

వ్యాధులను వైద్య సిబ్బంది సకాలంలో గుర్తించాలి

- ఎన్‌సీడీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్

సిరిసిల్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఉన్న వ్యాధులను వైద్య సిబ్బంది సకాలంలో గుర్తిస్తే నివారణకు కృషి చేయవచ్చునని ఎన్‌సీడీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధులపై శిక్షణ తరగతులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సులకు నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ వ్యాధులను సకాలంలో గుర్తించడం ద్వారా ఎన్నో రకాల ఇబ్బందులను నివారించవచ్చన్నారు. గుండెపోటు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌లు(ఊపిరితిత్తులు, నోటి, గర్భాశయ, రొమ్ములకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే విలువైన ప్రాణాలను రక్షించవచ్చన్నారు. డాక్టర్ రజిత మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు రక్తపరీక్షలతో పాటు క్యాన్సర్ పరీక్షలను నిర్వహించడం ద్వారా అవసరమైన చికిత్సను ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు అంజలి, అల్‌పెడ్స్, రామకృష్ణ, సంపత్‌కుమార్, అనిత, నయిమా, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సీడబ్ల్యూసీ చైర్మన్



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన బాలల సంరక్షణ సమితి చైర్మన్ అంజయ్య

సిరిసిల్ల క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజను గురువారం బాలల సంరక్షణ సమితి చైర్మన్ కమటం అంజయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ నిర్వహణ, పోక్సో పెండింగ్ కేసులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి సభ్యులు పున్నం చందర్, ఖాజా పాషలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన శాతావాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యురాలు సూజత సూరేపల్లిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పూర్ణిమ ఆధ్వర్యంలోని ప్రతినిధులు గురువారం స్థానిక ప్రొబెషనరీ ఎస్ఐ లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. దేశంపట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆమె వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆమెను విధులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్రవంతి, తేజశ్రీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం

ముస్తాబాద్, (గంభీరావుపేట) మే 8 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం గన్నేరుపల్లెకు చెందిన నిమ్మల ప్రభాకర్ అనే రైతు తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్ గురై మృతిచెందాడు. దీంతో సెస్ సంస్థ ద్వార నష్టపరిహారం కింద మంజూరైన రూ.5 లక్షల చెక్‌ను మృతుడి భార్య లక్ష్మికి గురువారం అందజేశారు. అందుకు సహకరించిన సెస్ డైరెక్టర్ అంజిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిప్పలపల్లి మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య, సెస్ సిబ్బంది ఉన్నారు.

'ఇందిరమ్మ ఇల్లు' పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 13 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట గ్రామంలో 13 ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఇప్పటికే బేస్‌మెంట్ పూర్తి చేసుకొని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేపట్టలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద కొత్తపేట గ్రామం ఎంపిక అయినట్లు తెలిపారు. మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. గ్రామంలోని కొలకని రామవ్వ ఇల్లు లేదని ప్రభుత్వ విప్‌నకు తెలుపగా, వెంటనే ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీనివాసరెడ్డి, తర్రె మనోహర్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయాన్ని మూసివేయడం.. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే..

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి పేరుతో ఆలయాన్ని మూసివేసి అభివృద్ధి చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనని వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి నివేదికలపై రహస్యం ఎందుకని ప్రశ్నించారు. రాజన్న ఆలయ నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని, ఆలయాన్ని మూసివేస్తే చిరు వ్యాపారులు తీవ్ర మనోవేదనకు గురువుతన్నారని అన్నారు. రోడ్డు విస్తరణ ఎక్కడి నుంచి ఎక్కడికి విస్తరిస్తారు తెలియజేయాలన్నారు. ఆగమశాస్త్రం వారి సలహాలతో ప్లాన్ చేయాలని సూచిస్తున్నామని అన్నారు. ఆగమశాస్త్ర నిపుణుడిని, స్థపతిని నియమించారా అని ప్రశ్నించారు. డబ్బులు రాజన్న ఆలయ డిపాజిట్ నుంచి తీస్తున్నారా.. ప్రభుత్వం నుంచి వస్తున్నాయా వివరించాలని అన్నారు. డబ్బులు సరిపోక మధ్యలో అభివృద్ధి పనులు నిలిపివేస్తే భక్తుల పరిస్థితి ఏమిటని అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట తరహాలో ప్రణాళికలను రచించి ఆర్కిటెక్ట్ నియమించి 5 సంవత్సరాలలో పనులు పూర్తి చేశారని, మీరు రాజన్న ఆలయాభివృద్ధిని ఎలా చేస్తారో తెలియజేయాలని అన్నారు. గాజులు అమ్ముకునే మహిళలు, పూలు పండ్లు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, క్రాంతికుమార్, రామ్మోహన్, సిరిగిరి చందు, గోలి మహేష్, జోగిని శంకర్, నరాల దేవేందర్, శ్రీకాంత్‌గౌడ్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 13న ప్రవేశ పరీక్ష - జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలు.. 2136 మంది అభ్యర్థులు - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): టీజీ పాలిసెట్ పరీక్ష నిర్వహణ సజావుగా సాగే విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మే 13న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల కోసం మే 13న ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు జరిగే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామని, 2136 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాల తరలింపు, అవసరమైన బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద కరెంట్ కోతలు ఉండవద్దని విద్యార్థులకు అవసరమైన రూట్లలో బస్సులు నడిచేలా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ చంద్రయ్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి, రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలతో కాకుండా గ్రామ, వార్డు సభలల్లోనే ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారులను కమిటీలతోనే జాబితాలను తయారుచేసి అధికారులు సర్వే చేస్తున్నారన్నారు. దీని వలన అసలైన అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాల్లో లేకపోవడంతో పాటు భూములు, ఆస్తులు ఉన్న వారి పేర్లు జాబితాల్లో ఎంపిక చేస్తున్నారన్నారు. దీని వలన అసలైన లబ్దిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలతో కాకుండా గ్రామ, వార్డు సభల్లోనే ఎంపిక చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడం రమణ, గన్నేరం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ. 19.99లక్షల విలువగల 53 సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచారన్నారు. ఈప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి సీఎం సహాయనిధి ద్వారా, ఎల్‌వోసీల ద్వారా ఇప్పటి వరకు రూ.20కోట్ల పైచిలుకు మంజూరు చేశామన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. గత ప్రభుత్వంలో అసలు గత ప్రభుత్వంలో ఎల్‌వోసీ అంటేనే ప్రజలకు తెలియని పరిస్థితి ఉండేదని, ప్రజా ప్రభుత్వంలో లెక్కకు మంచి ఎల్‌వోసీలు ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరంగా పేదలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, నియోజకవర్గ ప్రజలకు వైద్యం పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతనంగా రుద్రంగి మండలంలో రూ.1.43 కోట్లతో, ఫాజుల్‌నగర్‌లో రూ. 1.43 కోట్లుతో ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామన్నారు.

రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు..

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నడుస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వర్షం పడి తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా కొనుగోలు చేస్తామన్నారు. కొందరు కావాలని రైతుల ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని, రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుంటే ఇంటర్‌మిడిట్ గోదాంలలో ధాన్యాన్ని నిలువ చేశామన్నారు. వారం పది రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. ప్రతిరోజూ అధికారులతో, రైతులతో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని, రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అంతే కాకుండా కొన్ని విషయాలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పద్ధతి ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మీరూ అందించే సూచనలు, సలహాలు స్వీకరిస్తూ ముందుకు పోతున్నామని అన్నారు. త్వరలోనే రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ పూర్తి అయి నిబంధనల ప్రకారం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్వర్టును ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తిమృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు నర్సయ్య (66) అనే వ్యక్తి సింగరేణిలో రిటైర్డు అయి బెల్లంపల్లిలో నివాసం ఉంటున్నాడు. మానకొండూర్‌కు చెందిన కొండ్ర సంజీవ్ అనే వ్యక్తితో గురువారం నర్సయ్య కారులో పచ్చునూర్‌కు వెళ్లి మానకొండూర్‌కు తిరిగి వస్తున్నారు. అన్నారం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందగా సంజీవ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు గురువారం ఢీట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ వైపు నుంచి హుజూరాబాద్ వైపు 52మంది ప్రయాణికులతో వెళ్తుంది. ఈ క్రమంలో వంకాయగూడెం శివారులో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘనటలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.

మద్యం మత్తులో వరదకాలువలో పడి ఒకరి మృతి

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వరద కాలువలో పడి గుర్రం నాగమల్లు(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం సర్వాపూర్‌కు చెందిన గుర్రం నాగమల్లు కొంతకాలంగా కుటుంబసభ్యులతో కలిసి వేములవాడలో ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగమల్లు ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల స్వగ్రామమైన సర్వాపూర్‌కు వచ్చిన నాగమల్లు మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు వెతికారు. గురువారం గ్రామ శివారులోని వరదకాలువలో నాగమల్లు మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురి అరెస్ట్

మల్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారంకు చెందిన ఓర్సు వనజ అనే మహిళ సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకొని ఘాట్‌రోడ్డు మీదుగా తన కొడుకులతో దిగువ కొండగట్టుకు వస్తోంది. కారులో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వనజ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణకు యత్నించగా ఆమె కిందపడిపోవడంతో నిందితులు కారులో పారిపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ నీలం రవి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మల్యాల బైపాస్ మార్గంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోని ఐదుగురు అనుమానస్పదంగా కనిపించారు. దీంతో విచారణ జరుపగా చైన్‌స్నాచింగ్ దొంగలుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. వారంతా కరీంనగర్‌కు చెందిన వారు కాగా దొంగతనాలే ప్రవృత్తిగా మరో చోరీ చేయడానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సురేందర్ కథనం మేరకు ధర్మారం మండలం కటికనపల్లి గ్రామానికి చెందిన కట్ట నవీన్(32) మరో ఇద్దరితో బైక్‌పై కరీంనగర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో ఆర్నకొండ శివారులో బుధవారం అర్ధరాత్రి తర్వాత బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. నవీన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరికీ గాయాలైనట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం బైక్ అదుపుతప్పిన సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్జున్ తన ద్విచక్ర వాహనంపై గొల్లపల్లిలోని వివాహ వేడుకలకు హాజరై తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



- ‘శాతవాహన’లో గందరగోళ పరిస్థితి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే పరీక్షలు నిర్వహించలేమని తేల్చిచెప్పిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
- ఆందోళనలో డిగ్రీ విద్యార్థులు

పరీక్ష..ప్రశ్నార్థకం



గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ప్రభుత్వం మూడేళ్లుగా విడుదల చేయలేదు. డిగ్రీ పరీక్షలు నిర్వహించలేమని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. దీంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 14 నుంచి డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్స్ పరీక్షలు ప్రారంభంకావాల్సి ఉంది. ప్రైవేటు కళాశాలలు చేతులెత్తేయడంతో వర్సిటీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో పరీక్షలను ఆకస్మికంగా వాయిదా వేయవలసిన పరిస్థితులు తలెత్తాయి. పరీక్షలు వాయిదా పడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 వేల మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు 84 ఉన్నాయి. వీటిలో 36 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయి లు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు పరీక్షలు నిర్వహించలేమని ప్రకటించాయి. ఫీజుబకాయిలను పరీక్షలకు ముడిపెట్టొద్దని వర్సిటీ అధికారులు కళాశాలల ప్రతినిధులకు నచ్చ చెబుతున్నా.. వారు వినడం లేదు.

కష్టంగా కళాశాలల నిర్వహణ :

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 84 డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వాటి 15 ప్రభుత్వ కళాశాలలు, ఎనిమిది ట్రైబల్, సోషల్, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండు ఎయిడెడ్, 59 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి కోట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నాయి. దీంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, వర్సిటీకి చెల్లించాల్సిన గుర్తింపు ఫీజులు భారంగా మారాయని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. దీంతో పరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు పూర్తికాగా.. శాతవాహన పరిధిలో డిగ్రీ పరీక్షలపై ప్రతిష్టంభన నెలకొంది. డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులు మాత్రం తాము పోటీపరీక్షలకు అనర్హులమవుతామని.. పరీక్షలు నిర్వహించాలనిలని కోరుతున్నారు.

అయోమయ పరిస్థితి నెలకొంది
చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు



శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తారో.. లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్నత చదువులకు, ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన సమయంలో విద్యార్థులు పరీక్షలు ఉంటాయో ఉండవో అనే అయోమయంలో పడిపోయారు. చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు వెంటనే నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేం
ఎం వెంకటేశ్వరావు, సుప్మా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



మూడు సంవత్సరాల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం బకాయిలు ఇచ్చేంత వరకు పరీక్షలు నిర్వహించలేమని వైస్ చాన్సలర్‌కు సుప్మా సభ్యులందరం కలిసి చెప్పాము. ప్రభుత్వం గతంలో చాలా సార్లు మాట ఇచ్చి మాట దాట వేసింది. ఐదు యూనివర్సిటీ పరిదిలో పరీక్షలు బహిష్కరించాము.

బకాయిలను విడుదల చేయాలి
కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రంలో ఉస్మానియా మినహా మిగతా ఐదు యూనివర్సిటీల్లో డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు జరగడం లేదు. కళాశాల యాజమాన్యాలు పరీక్ష ఫీజులను యూనివర్సిటీలకు చెల్లించలేదు. దీంతో ప్రధానంగా మూడో సంవత్సరం విద్యార్థులు భారీగా నష్ట పోయే అవకాశం ఉంది. వారు సెమిస్టర్ పరీక్షలు రాసి పాసై పోటీ పరీక్షలు రాయడానికి, పీజీ సెట్ రాయడానికి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. డిగ్రీ విద్యార్థుల్లో దాదాపు 80 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారపడి చదువుకునేవాళ్లే ఉన్నారు.

ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేయొద్దు..
రాచమల్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వమూ అదే దారిలో పయనిస్తోంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. స్కాలర్‌షిప్‌లను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేయాలి.



భార్య, అత్తామామల వేధింపులకు యువకుడి బలి

చొప్పదండి, మే 8 (ఆంధ్రజ్యోతి): భార్య, అత్తమామల వేదింపులు భరించలేక యువకుడు మరణించిన సంఘటన గురువారం చొప్పదండిలో జరిగింది. ఎస్‌ఐ సురేందర్ కథనం మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కరం గ్రామానికి చెందిన ఉండాటి సతీష్(30)కు చొప్పదండికి చెందిన కళతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. పెళ్లి నాటి నుంచి సతీష్ అత్తగారింట్లో ఉంటుండగా అత్త మానుపాటి రాజవ్వ, మామ మానుపాటి కనుకయ్య, భార్య కళతో పాటు మరదలు వేధింపులు భరించలేక గురువారం ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. మృతుడు సతీష్ తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న గంగారెడ్డి

కోరుట్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల రూరల్ మండలం జోగినిపల్లి గ్రామంలో పాత కక్షలతో గంగారెడ్డి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్ గురువారం కత్తితో దాడి చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల నవీన్, ముక్కెర గంగారెడ్డిలు ఇద్దరు బర్రెల కాపరులు. వీరి మధ్య గతంలో పాత కక్షలు ఉండేవి. గురు వారం ఉదయం గ్రామంలో ఓ హోటల్ వద్ద ముక్కర గంగారెడ్డి టీ తాగుతుండగా నవీన్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన చుట్టు పక్కల వారు వారించడంతో నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. గంగారెడ్డిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి బంధువులు తరలించారు. గంగారెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు కూలి నిర్ణయించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తి సంఘాల మహిళల కోసం అందించే చీరలను తయారుచేసే కార్మికులకు కూలి నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు బైక్‌ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మరమగ్గాల, వార్పిన్, వైపని కార్మికులు తాము తయారు చేసే చీరలకు కూలి నిర్ణయించడంతోపాటు యజమానులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా పొదుపు సంఘాల సభ్యులకు అందించే చీరలకు సంబంధించి మరమగ్గాల, వార్పిన్, వైపని అనుబంధరంగాల కార్మికులకు మెరుగైన వేతనం వచ్చే విధంగా కూలి పెంచాలని నెల రోజుల క్రితం సమ్మె చేసిన ఫలితంగా ప్రభుత్వం యాజమానులకు ఒక మీటర్‌కు అదనంగా రెండు రూపాయల ధర పెంచిందన్నారు.

కానీ యజమానులు మాత్రం కార్మికులకు కూలి పెంచి ఇవ్వడం లేదన్నారు. దీని వలన కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి యజ మానులతో చర్చలు జరిపి కార్మికులకు కూలి నిర్ణయించే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. కార్యక్రమంలో వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లే సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేనీ ప్రవీణ్, అవదూత హరిదాసు, అడిచర్ల రాజు, శ్రీకాంత్, రమేష్, మధు, శంకర్, సదానందం, శ్రీనివాస్, రాజశేఖర్, సతీష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల రాస్తారోకో



ఫాజుల్ నగర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని గురువారం ఫాజుల్‌నగర్ గ్రామంలో రైతులు బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలు ఉన్న కారణంగా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా లారీలు లేనందున ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 20వ నంబర్ నడుస్తుందని 150 నెంబర్ వరకు లైన్ ఉందన్నారు. స్థానిక అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వీలైనంత వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ నాయకుడు చిందం కుమార్, పోగుల రాకేష్, పెద్దకుర్మ మల్లేశం, కొండవేని మోహన్, మునిందర్‌రెడ్డి, ఎగుర్ల రాజు, అంజయ్య, ఓదేలు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

లక్నోలో నాబార్డు రెండు రోజుల జాతీయ సదస్సు

- ప్రారంభించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



జాతీయ సదస్సులో ప్రతినిధులతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా సహకార సంస్థల బలోపేతం కోసం నాబార్డు ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. సహకార సంస్థల్లో షేర్ సర్వీసెస్ ఎంటిటీ, సహకారంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించినున్నారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార బ్యాంకుల బలోపేతం కోసం అమిత్‌షా నాయకత్వంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ లాభాలు, నష్టాలను చర్చించడానికి, తగిన చర్యల కోసం తీసుకున్న చొరవను స్వాగతించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు దీర్ఘకాలంలో చిన్న సహకార బ్యాంకులకు ప్రయో జనం చేకూరుస్తాయని అన్నారు. ఈ సదస్సులో సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ బుటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్‌సీఎస్ సౌరబ్ బాబు, నాబార్డు చైర్మన్ షాజీ కేవీ, నాబార్డు డీఎండీ గోవర్ధన్ రావత్, సహకార రంగంలోని ఐటీ, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీకి ఉత్తమ పనితీరు అవార్డు

కరీంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి స్వయం సహాయ బృందాల అనుసంధానంలో రాష్ట్రస్థాయి ‘ఉత్తమ పనితీరు అవార్డు’ లభించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల జీవనోపాధిని మెరుగుపర్చడంలో నిరంతర రుణ సహాయాన్ని అందిచినందుకు కేడీసీసీబీకి ఈ అవార్డు లభించింది.



మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణ

మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌కు డాక్టరేట్



కనపర్తి సురేష్

కరీంనగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజనల్ కో-ఆర్డినేటర్ కనపర్తి సురేష్ డాక్టరేట్‌కు ఎంపిక య్యారు. అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలల్లో థీమాటిక్ స్టడీ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెలిస్సా హెల్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో సమర్పించిన పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండికి చెందిన సురేష్ డాక్టరేట్ లభించడంపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

ఇసుక డంపు స్వాధీనం

ఎండపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లి గ్రామంలో ఎనిమిది ఇసుక డంపులు ఉన్నాయనే సమాచారంతో గురువారం ఎండపల్లి ఆర్‌ఐ దొంత రాజేశ్వరి నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీన పరుచుకున్నారు. ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను వేలం పాట నిర్వహించగా ఏడు వేలు రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆర్‌ఐ రాజేశ్వరి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా ఎవరు చేపట్టినా వాటిని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ హెచ్చరించారు.

ప్రతీ పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం : విప్



బస్సు వద్ద ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ప్రజలు

పెగడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి పల్లె కు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించి, ప్రజల ప్రయాణ బాదలు తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రామబద్రునిపల్లిలో గురువారం బస్ సర్వీస్‌ను కరీంనగర్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో కలసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రామబద్రుని పల్లి, ల్యాగలమర్రి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజారాంపల్లి తదితర గ్రామాల ప్రజల వినతుల మేరకు బస్ సర్వీస్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు.

చిరుతల భజనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్





చిరుతల రామాయణాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, జ్ఞాపికను ప్రదానం చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 8 : ప్రాచీన గ్రామీణ కళారూపమైన చిరుతల భజనకు ప్రపంచ ప్రఖ్యాతి తీసుకరావాలనే ఉద్దేశ్యంతో కళాభారతిలో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహణలో 8 గంటల పాటు నిర్విరామ చిరుతల భజన చేశారు. ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 600 మంది కళాకారులు ప్రత్యేక వేషధారణలో చిరుతల మోతలతో, చక్కని పాటలతో, గజ్జెలు కట్టి ప్రత్యేక విన్యాసాలు చేస్తూ ప్రదర్శన ఇచ్చారు. రికార్డు నమోదుకు ప్రతినిధిగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి బింగి నరేందర్ హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆర్‌డీవో సీహెచ్ మహేశ్వర్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ సువార్త ఈవెంట్ రికార్డులో నమోదైనట్లు ప్రకటించారు. నిర్వాహకులు జి కృపాదానం, డాక్టర్ విష్ణుదాసు గోపాలరావు, సల్వాజి ప్రవీణ్‌కు రికార్డు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, టీం లీడర్లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు.

పీజీ కళాశాలలో భవన నిర్మాణానికి భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, పక్కన ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సుమారు 10లక్ష రూపాయల వ్యయంతో ఎంబీఏ భవనం, 13లక్షల రూపాయలతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యార్థులకు అవసరమయ్యే వివిధ రకాల మౌలిక సదుపాయాలను సమకూరుస్తున్నామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ అకాడమిక్ బ్లాక్‌తోపాటు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ని ప్రారంభించారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్‌డీ టూ వీసి డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురే ష్‌కుమార్, శాతవాహన యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్, ఇంజనీర్ ప్రకాస్‌రావు, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై ఆర్టీసీ ఈడీ సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడీ సోలమన్

భగత్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం స్థానమైన కాళేశ్వరంలో (గోదావరి, ప్రాణహిత, సరస్వతి) సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో పనులను పరిశీలించి బస్సుల ఏర్పాట్లపై అధికారులతో ఆర్టీసీ జోన్ ఈడీ పగిడిమర్రి సోమలన్ సమీక్ష నిర్వహించారు. సరస్వతి పుష్క రాలకు కరీంనగర్ జోన్‌లోని వివిధ రీజియన్‌ల నుంచి నడిపే బస్సులకు సంబంధించి చేస్తున్న ఏర్పాటు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి రాజు, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భానుకిరణ్, ఎస్ భూపతిరెడ్డి, భూపాలపల్లి డిపో మేనేజర్ ఇందిర, ఈడి కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ ప్రయాణికులకు పది శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్-వరంగల్ రూట్‌లో డీలక్స్ బస్సులలో (డీజిల్, ఎలక్ట్రికల్) ప్రయాణ చార్జీలో పది శాతం రాయితీ ఉందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, మే, 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఉంచి శోభాయాత్రగా జగ్గసాగర్ గ్రామంలోని కొండస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈనెల 9న ఆలయంలో నిర్వహించే స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆన్‌లైన్‌లో రాజన్న సేవలు

భక్తులు ముందే బుక్ చేసుకునే అవకాశం

దూరప్రాంత భక్తులకు తప్పనున్న ఇబ్బందులు



వేములవాడ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో చేపట్టే సేవలను భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చారు. నిత్యం రాష్ట్రంతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులతో రద్దీగా మారుతున్న సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సేవలను ఆన్‌లైన్ చేశారు. రాజన్న ఆలయంలో నిత్యం నిర్వహించే పూజల వివరాలు తెలియక భక్తులు రాజన్నను దర్శించుకుని తిరిగి ప్రయాణమయ్యే వారు. అయితే రాజన్న ఆల యానికి వచ్చే భక్తులు ఎక్కడున్నా తమ ఫోన్‌లో ఆన్ లైన్ ద్వారా వారం రోజుల ముందే తాము చేయిం చుకునే పూజలను బుక్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువచ్చారు. రాజన్న ఆలయంతో పాటుగా శ్రీనగరేశ్వర, బద్దిపోచమ్మ, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి, శ్రీభీమేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత పూజల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరిచారు. భక్తులకు తమకు కావాల్సిన టికెట్లను వేములవాడ టెంపుల్.తెలంగాణ.గౌట్. ఇన్ అనే వెబ్ సైట్‌లో బుక్ చేసుకునేలా అందుబాటులోకి తీసుకవచ్చారు.

ఆది, సోమవారాల్లో గర్భాలయ సేవలు రద్దు..

రాజన్న ఆలయానికి ప్రతి ఆది, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో ఆది, సోమవారాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గర్భగుడిలో నిర్వహించే పూజలను నిలిపివేశారు. అభిషేకం, అన్నపూజ, ఆకు పూజలను నిలిపివేసి మిగతా సేవలు కొనసాగిస్తారు.

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారికి శాశ్వత పూజలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. శాశ్వత పూజలు 10సంవత్సరాల వరకు వర్తిస్తాయి. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే పూజలు చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. శాశ్వత పూజల వివరాలు.. రుద్రాభిషేకం రూ.3000, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం రూ.1500, అన్నపూజ రూ.1000, శివకల్యాణం రూ.5000, మహాలింగార్చన రూ.3000, కుంకుమ పూజ రూ.1000, కోడెపూజ రూ.1000గా నిర్ణయించారు.

వాహనాల పూజల వివరాలు..

లారీ, బస్సు, కారులకు రూ.400, ఆటో, టెంపో రూ.250, మోటార్‌సైకిల్ రూ. 100గా ఉన్నాయి. రాజన్న దర్శనం కోసం వెళ్లే భక్తులు శీఘ్ర దర్శనం టికెట్ ఒక్కరికి రూ.100, బ్రేక్‌దర్శనం ఒక్కరికి రూ.300 ధరలు ఉన్నాయి. రాజన్న ప్రసాదాల వివరాలు... లడ్డూ, బోగం రూ.700, సిరా బోగం రూ. 600, పులిహోర బోగం రూ. 200, దద్దోజనం రూ. 300, లడ్డూ ఒక్కటికి రూ. 20, అభిషేకం లడ్డూ రూ. 100, పులిహోర ఒక్కటి రూ.15.

వసతి గదుల వివరాలు..

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలోని ఆయా వసతి గదు ల్లోని రూముల ధరల వివరా లు.. భీమేశ్వర సదన్ గెస్ట్‌హౌస్ రూ.2800, భీమేశ్వర ఏసీ సూట్ రూ.1600, భీమేశ్వర సదన్ ఏసీ ఒక్క రూమ్ రూ.1344, నందీశ్వర ఏసీ సూట్ రూ.2800, నందీశ్వర ఏసీ రూమ్ రూ.1008, నందీశ్వర నాన్ ఏసీ రూమ్ రూ. 500, అమ్మ వారి అతిథిగృహం రూ.1600, పార్వతి పురం బ్లాక్‌లు రూ.672, పార్వతి పురం రూమ్ రూ.336, లక్ష్మగణపతి కాంప్లెక్స్ ఒక్క రూమ్ రూ.448.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదనే ఆన్‌లైన్ సేవలు

వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. భక్తులకు రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల వివరాలు తెలియాలనే ఉద్దేశ్యంతోనే ఆన్‌లైన్‌లో ఉంచాము. దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు వారం రోజుల ముందే తమ ఫోన్ ద్వారా నిమిషాల్లో టికెట్స్, రూమ్‌లు బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాము. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

నిత్య పూజల వివరాలు..

రుద్రాభిషేకం (మహామండపం) రూ. 1000, కోడెమొక్కు రూ. 200, అభిషేకం (నాగిరెడ్డి మండపం) రూ. 500, అన్న పూజ రూ.500, అన్నపూజ గర్భగుడిలో రూ. 1000, ఆకు పూజ రూ. 1000, కుంకుమ పూజ రూ.300, శివకల్యాణం రూ. 1500, చండీ సహిత రుద్రహోమం రూ. 1516, మహాలింగా ర్చన రూ. 1000, పెద్ద సేవ రూ.350, పల్లకీ సేవ రూ. 200, సత్యనారాయణ వ్రతం రూ.600 కాగా, శ్రీభీమేశ్వరస్వామి ఆల యంలో పూజల వివరాలు శ్రీభీమేశ్వర అభిషేకం రూ. 516, నవగ్రహ పూజ రూ.516, ద్వాదశ జ్యోతిర్లింగాల అభిషేకం రూ.516గా ఆన్‌లైన్ చేశారు.



కాల్షియం కార్బైడ్ నిల్వల గోదాంలో అధికారుల సోదాలు



సోదాలు చేస్తున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తీన్‌ఖానీ చౌరస్తా సమీపంలో గల ఓ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా కాల్షియం కార్బైడ్ బాక్స్‌లను పెద్దఎత్తున నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. సదరు గోదాంలో సీలు గల బాక్సుల్లో ప్యాకెట్లు నిల్వచేయడాన్ని గుర్తించారు. సుమారు గంట పాటు పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. సహజసిద్ధంగా పండాల్సిన మామిడి, ఇతర పండ్లను కృతిమ పద్ధతిలో త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి కాల్షియం కార్బైడ్ వినియోగంలో మగ్గబెట్టడానికి కొన్ని నిషేధిత కంపెనీలు, నాసిరకం కంపెనీలకు చెందినవి ఉన్నట్లు అనుమానించి పలు బాక్సులను పట్టుకున్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ కిరణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీటెక్ మొదటి సంవత్సరంలో మార్కులు తక్కువ వచ్చాయని జగిత్యాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కన్నవేణి సౌజన్యరెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన కన్నవేణి మల్లారెడ్డి కూతురైన సౌజన్యరెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. గురువారం ఉదయం లేచి చూసేసరికి హాల్లో ఉరి వేసుకుని మృతిచెంది ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధర్మపురిలో వైభవంగా చందనోత్సవం





యోగా నరసింహ స్వామి వారలను చందనంతో అలంకరణ చేసి హారతి ఇస్తున్న అర్చకుడు, స్వామి వారి పూజల్లో పాల్గొన్న భక్తులు

- భారీగా దర్శనం చేసుకున్న భక్తులు

ధర్మపురి, మే 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు.

గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఆలయాలు నరసింహ నామస్మరణలతో ప్రతిధ్వనించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీసీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నరసింహుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం సందర్శించారు. అనంతరం ఆయన చందనోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం కప్పి ప్రసాదాలు అందించి సన్మానించారు.



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న అధికారులు

మానసాదేవి ఆలయంలో సప్తమ వార్షికోత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పసుపుతో అభిషేకం చేస్తున్న వేద పండితులు

గన్నేరువరం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ వేడుకల్లో ఉదయం నుండి గణపతి హోమాలు, మానసాదేవి, అపురూపలక్ష్మి అమ్మవార్లకు 54 కిలోల పసుపు, కుంకుమలతో అభిషేకాలు ఆలయ ప్రధాన అర్చకుడు అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'శాతవాహన' పరిధిలో 15 నుంచి బీఎస్సీ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆనర్స్ (4 సంవత్సరాల కోర్స్)లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమై మే 30కి ముగు స్తాయని, బీఎస్సీ ఆనర్స్‌లో రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు కంప్యూటర్ సైన్స్‌లో, రెండవ సెమిస్టర్ బయో మెడికల్ సైన్స్‌లో జరగనున్నట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.డి.సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇతర వివరాలకు కళాశాలలో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



సెలవుల్లో ఉత్సాహంగా

● 'స్వచ్ఛ' హుజూరాబాద్‌లో భాగంగా వేసవి శిక్షణ శిబిరం ● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు




హుజూరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

హుజూరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛ హుజూరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ మైదానంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారం, చందరంగం, కరాటే, క్రికెట్, ఖోఖో, హాకీ తదితర ఆటల పోటీల్లో పీఈటీల ఆధ్వర్యంలో నేర్చుకుంటున్నారు. పిల్లలు ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్, టీవీల వైపు మొగ్గు చూపకుండా ఉండేందుకు క్రీడలు అలవాటు చేస్తున్నారు. ఈ క్రీడాకారులకు డాక్టర్ నవీన్, న్యాయవాది ముక్కెర రాజు, సారయ్యలు టీషర్ట్, బిస్కెట్స్, పండ్లు, పాలు అందిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆటలను ప్రోత్సహిస్తుండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో హైస్కూల్ మైదానం విద్యార్థులతో కిక్కిరిసిపోతోంది.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే క్రీడల్లో శిక్షణ

సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్



వేసవిలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు స్వచ్ఛ హుజూరాబాద్‌లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మున్సిపల్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఇంట్లో ఉంటే సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడకుండా క్రీడలు దోహదపడుతాయి. పిల్లలను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఖోఖో, హాకీ, వాలీబాల్, క్రికెట్, చందరంగం, క్యారం తదితర క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ పిల్లలకు దాతలు ముందుకు వచ్చి పండ్లు, పాలు, బిస్కెట్స్ అందజేస్తుండటం అభినందనీయం.





క్యారం, చందరంగం ఆడుతున్న విద్యార్థులు

సైలెన్సర్లు మార్చి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జగిత్యాల అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. అధిక శబ్దం కలిగించే 130 మాడిఫైడ్ సైలెన్సర్లను గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని రోజులుగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తు ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లను మాడిఫై చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందుల కలుగజేస్తున్న 130 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి సైలెన్సర్‌ను ధ్వంసం చేసినట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని అన్నారు. శబ్ధ కాలుష్యాన్ని నిరోదించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాడిఫై సైలెన్సర్‌లను వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. కా ర్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఇల్లంతకుంట, మే 8 (ఆంధ్రజ్యోతి) మండలంలో సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని సామాజిక ఉద్యమకారుడు సావనపెల్లి రాకేష్ పేర్కొన్నాడు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతు బస్టాండ్‌లో ప్రయాణీకులు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారని, డిగ్రీ కళాశాల లేకపోవడంతో అమ్మాయిలు ఇంటర్‌తోనే విద్యను ఆపివేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 11న మండల కేంద్రంలో సమస్యల సాధన కోసం అఖిలపక్ష సమావేశం జరుగుతుందన్నారు. గతంలో అనేక సమస్యలపై చేసిన పోరాటాల ఫలితంగా ఆసుపత్రి స్థాయి పెరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. సమావేశంలో నాయకులు ఏనుగుల లింగన్న, మామిడి విజయ్‌చ దాసరి రవీందర్ పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, మే 8(ఆంధ్రజ్యోతి) : అనుమతిలేని ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఓ పాఠశాలకు ఇంతవరకు అనుమతులు లేకపోయినా పలు గ్రామాలలో అడ్మీషన్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామాలలో పీఆర్‌వోలను పెట్టుకొని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పుతున్నారని అన్నారు. చదువుల పేరుతో ఒత్తిడికి గురిచేసే పాఠశాలలో పిల్లలను చేర్పించవద్దన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనట్లయితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రారంభం



రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

ఇల్లంతకుంట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల క్లస్టర్ రైతువేదికలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యనమోదు కార్యక్రమం గురువారం ప్రారంభం అయ్యింది. రాబోవు రోజుల్లో రైతులకు పీఎం కిసాన్, పంటబీమా పథకాల కోసం విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరం ఏర్పడనుంది. ఈసందర్భంగా ఏఈవో రవళి మాట్లాడుతూ రైతులు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ నంబర్ తీసుకొని రావాలన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, దానిని ఎంటర్ చేయడం ద్వారా 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య రైతుకు కేటాయించడం జరుగుతుందని, రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశంసా పత్రం అందుకున్న యువ కవి

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన తెలుగు భాష చైతన్య సమితి వార్షికోత్సవంలో ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లికి చెందిన యువ కవి కట్ల శ్రీనివాస్ గురువారం పాల్గొని కవితా పఠనం చేశారు. తెలుగు భాషపై ఆయన తన కవితలను వివరించారు. సమితి అధ్యక్షుడు బడేసాబ్, సమన్వయకర్త జయప్రకాశ్‌ల చేతుల మీదుగా యువ కవి శ్రీనివాస్ ప్రశంసా పత్రం అందుకున్నారు. శ్రీనివాస్‌ను స్థానికులు అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం పరామర్శించారు. గ్రామంలోని రఫీక్ భార్య రెండు రోజుల కిందట అనారోగ్యంతో చనిపోయింది. యువకుడు మహేశ్ వివాహం కావడం లేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాలను ఆగయ్య ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. వెంట సందీప్, పర్శరాములు, కల్యాణ్, శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుడు హన్మండ్లశర్మ ఆధ్వర్యంలో పూజలను జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధల నడుమ పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులను ఎంఈవో కృష్ణహరి, ఎస్సీ మహేశ్ బి గీతేలు అభినందించారని పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో పట్టుదల, ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

చందుర్తి మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలోని శ్రీరాముల సత్తమ్మకు రూ.3లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాల పండుగ



పూజలు నిర్వహిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కట్టలింగంపేటలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ వేడుకల్లో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు చిలుక పెంటయ్య, ఏనుగుల శ్రీనివాస్, జమున, లక్ష్మణ్‌రావు, పరుశరాములు, రమేష్ రావు, జలందర్, ఆనంద్, కమలాకర్, రవి గ్రామ యువకులు పాల్గొన్నారు.

చిరుతల భజన కళాకారుల ప్రదర్శన

ఇల్లంతకుంట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుతల భజన కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన చిరుతల భజన కార్యక్రమంలో వెంకట్రావుపల్లె, సోమారంపేట గ్రామాలకు చెందిన కళాకారులు ఉత్తమ ప్రదర్శన కనబర్చారు. కళాకారులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై సంబరాలు









ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సిరిసిల్ల, వేములవాడల్లో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, ఇల్లంతకుంటలో పూజలు చేస్తున్న గ్రామస్థులు, రుద్రంగిలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ టెర్రరిస్టు స్థావరాలపై భారత్ బలగాలు చేసిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు భారీగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి, క్రీడల కార్యదర్శి నరిమెట్ల రమేశ్, గ్రంథాలయ కార్యదర్శి శరత్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా వేములవాడ పట్టణంలో న్యాయవాదులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, గడ్డం సత్యనారాయణరెడ్డి, కటకం జనార్ధన్, రేగుల దేవేందర్, గుడిసే సదానందం, పొత్తూరు అనిల్‌కుమార్, పురుషోత్తం, కిషోర్‌రావు, గోగికారి శ్రీనివాస్, తాహెర్‌పాషా, నర్సింగరావు, పంపిరి శంకర్, విష్ణు, కనికరపు శ్రీనివాస్, అన్నపూర్ణ, మధ్య, సుజాత, మమత, నాయిమా, నాసారి తదితరులు ఉన్నారు.

● ఇల్లంతకుంట : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై దాచారం శ్రీవరదరాజ స్వామి ఆలయంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వేణు, నాయకులు శ్రీశైలం యాదవ్, నరిగె మహేష్, బర్ల శ్రీనివాస్, కావటి దయాకర్, రాగూడ దేవరాజ్, సూదుల రమేష్, బత్తిని శ్రీకాంత్ పాల్గొన్నారు.

● చందుర్తి(రుద్రంగి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై రుద్రంగి మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నాంద్యాడపు వెంకటేష్, బీజేపీ నాయకులు పడాల గణేష్, బోయిని రాజు, మీసాల రవీందర్, గడ్డం రవీందర్, పెద్ది శ్రావణ్, పడాల నరేష్ బొబ్బిలి గణేష్, గోలి రవీందర్, కంటే నరేష్, మంచే రవీందర్, బోయ శ్రావణ్, మ్యాకల పనింద్ర, పడాల వినయ్, బొబ్బిలి జగదీష్ పాల్గొన్నారు.

ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - ధాన్యం కొనుగోలు, రవాణా అంశాలపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి లక్షా 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. గంభీరావుపేట్, రుద్రంగి, వీర్నపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు ఇబ్బందులు వస్తున్నాయని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హమాలీల సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. రవాణా వాహనాలు సరఫరా చేయని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దిగుబడి చేసుకొని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చొరవతీసుకుని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడింగ్ త్వరగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే ఎస్మా చట్టం డిఫాల్ట్ రైస్‌మిల్లుల, రవాణా కాంట్రాక్టర్ మీద ప్రయోగించాలని, ఎక్కడైనా ఇతర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రాంత హమాలీలు అనే సాకుతో పనికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్‌మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులు సరఫరా చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీటీవో వి.లక్ష్మణ్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వేసవికాల సెలవులను సమ్మర్ క్యాంపు ద్వారా సద్వినియోగం చేసుకోవాలని వీర్నపల్లి మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సందర్శించారు. క్యాంప్‌లో స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మ్యాథ్స్, డ్యాన్స్, చెస్, యోగా డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను మరిచిపోకుండా తమకు ఇష్టమైన రంగంలో నిష్ణాతులుగా ఎదగడానికి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా సమ్మర్ క్యాంపునకు అనూహ్య స్పందన వచ్చినట్లు, క్యాంపు ద్వారా 70 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు ఇన్చార్జి తిరుపతి యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, గజ్జెల ప్రశాంత్, న్యాత రాజశేఖర్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, ఇన్‌స్ట్రక్టర్‌లు సుజాత, వినీత, వెన్నెల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సభలు

కథలాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకంలో భాగంగా గత ఏడాది చేపట్టిన పనులకు సంబంధించి ఈనెల 9 నుంచి 14 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఇప్పపల్లి, తుర్తి, 10న పోతారం, అంబారిపేట, కలికోట, పోసానిపేట, దూలూరు, 11న చింతకుంట, సిరికొండ, 12న ఊటపల్లి, 13న భూషణరావుపేట 14న తక్కళ్ళపల్లి, గంభీర్‌పూర్, తాండ్య్రాల, కథలాపూర్, బొమ్మెన, దుంపెట గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లను పెంచాలి

- ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి - సమీక్ష సమావేశంలో కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌లను పెంచడంతో పాటు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్మీడియేట్ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఇంటర్మీడియేట్ అధికారులతో జూనియర్ కళాశాలల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియేట్ 2025 ఫలితాల విశ్లేషణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అడ్మిషన్‌లు, కళాశాలల్లో మౌలిక వసతులకల్పన, రవాణా ఏర్పాట్లు, విద్యార్థుల సంక్షేమం వంటి పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే అధ్యాపకులు, ఇతర సిబ్బందికి బయోమెట్రిక్‌లతో హాజరు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలను రాసేందుకు సిద్ధంగా ఉన్న వారికి ప్రత్యేక తరగ తులను నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. గత 10 సంవత్సరాల్లో ప్రశ్నపత్రాల్లో వచ్చిన ముఖ్యమైన పాఠ్యాంశాలను అభ్యాసన చేయించి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫైర్‌సేఫ్టీ ఆడిట్ వారంలోగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌లు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అధ్యాపకులు, సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కళాశాలల అనుమతులు అఫిలేషన్ రెన్యూవల్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమీప రోడ్ల నుంచి ఆర్టీసీ బస్సులు నడిచేలా చూసు కోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజమనోహర్, జిల్లా మైనార్టీ అభివృద్ధి అధికారి ఎంఏ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

సిరిసిల్ల రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, టీపీసీసీ అబ్జర్వర్ సంగీతం శ్రీనివాస్, నాయకులు అడెపు చంద్రకళ, నీలిరవీందర్, యెల్లె లక్ష్మీనారాయణ, మ్యాన ప్రసాద్‌లు పాల్గొన్నారు. హజరత్ శావలి దర్గాలో మైనార్టీ సెల్ నాయకులు అహ్మద్ అమీర్‌ఖాన్, ఎండీ సలీం, ఎండి అయూబ్‌ఖాన్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీచేశారు. బొప్ప దాము, పోగుల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో..

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన చంద్రంపేట, సర్దాపూర్, పెద్దూర్, రగుడు, పెద్దబోనాల గ్రామాల్లో గురువారం రాష్ట్ర బీసీ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పెద్దూర్ గ్రామంలో ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయడంతోపాటు కేక్‌ను కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షులు మంగ ప్రశాంత్, చంద్రంపేట వార్డు అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం, ర్యాకం అనిల్‌కుమార్, గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, భరత్, మ్యాన లక్ష్మీనారాయణ, కోడం నాగభూషణం, తడుక వెంకటేశం, అడేపు ప్రసాద్, వేముల రాములు, నర్మేట శంకర్, కత్తెరపాక ఎల్లయ్య, ఎర్ర నర్సయ్య, తంశెట్టి చందు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం : మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను సిరిసిల్ల కోర్టు ఆవరణలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, కె. వెంకట్‌రెడ్డి, ఎల్లె జ్యోతి, కొల్లూరి ధర్మేందర్, భరత్ కుమార్, కిరణ్‌కుమార్, జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. నర్సయ్య, లక్ష్మారెడ్డి, చరణ్‌గౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్‌లోని సచివాలయంలో గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణగౌడ్, ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, దేవరాజు, మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డితోపాటు పలువురు నాయకులు గురువారం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరిశంకర్, ఏఎంసీ డైరెక్టర్ ప్రభాకర్, మండల యూత్ అధ్యక్షుడు గంగ స్వామి తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ను



సిరిసిల్ల పట్టణంలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాపూర్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు మంత్రి ప్రభాకర్‌గౌడ్ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణగౌడ్, ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సయ్య, దేవరాజు, మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌టోనీ, మోహన్, నాయకులు చరణ్ గౌడ్, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, కిరణ్, రాజనర్సు, అనిల్, పవన్, శివ, దేవయ్య, బాలయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, కృష్ణ, స్వామి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ (గంభీరావుపేట) : ముస్తాబాద్ మండల కేంద్రంలో వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజు, శ్రీనివాస్, నరేష్, బాను, ప్రశాంత్, బాల్‌రెడ్డి, బాను, రాజు తదితరులు ఉన్నారు.

● చందుర్తి : చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాదులో మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, రుద్రంగి ఏఎంసీ డైరెక్టర్ ఇందూరి మధు, నాయకులు దూది శ్రీనివాస్‌రెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

● బోయినపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. చుక్క శేఖర్ తంగళ్ళపల్లి గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సింగంగౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి లింగాల భూపతి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మునిగేల రాజు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నత్తు శ్రీనివాసరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏగుర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట, మే 8 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో గురువారం సాయంత్రం శ్రీవేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. రుక్మిణిసత్యభామసమేత వేణుగోపాలస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తి శ్రద్ధలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియాలో వివాదస్పద వ్యాఖ్యలు చేసిన శాతావాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, తెలంగాణ ఎడ్యుకేషన్ కమీషన్ సభ్యురాలు సూజత సూరేపల్లిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు పూర్ణిమ ఆధ్వర్యంలోని ప్రతినిధులు గురువారం స్థానిక ప్రొబిషనరీ ఎస్ఐ లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేశారు. దేశం పట్ల బాధ్యతగా వ్యవహిరించాల్సిన ఆమె వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆమెను విధులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్రవంతి, తేజశ్రీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

సిరిసిల్ల క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్ట ర్ నదన్‌కుమార్‌ను తిమ్మాపూర్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

ఘనంగా ముత్యాల దుర్గమ్మ బోనాల పండుగ



ముత్యాల దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంలోని ముత్యాల దుర్గమ్మ బోనాల పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బోనాల పండుగను నిర్వహించారు. బోనాల వేడుకల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామ స్వామి, ఆలయ నిర్మాణ దాత దారం నర్సయ్య, నాయకులు దారం రామచంద్రం, సత్తయ్య, ప్రభాకర్, మల్లేశం, కృష్ణ, శంకరయ్య, రాములు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.